



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :148 22 బుధవారం, ఏప్రిల్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## అబద్ధాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

### - మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపి అర్వింద్

హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)



వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు.

- మిగతా 2 లో..

## భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ



- కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

ఖమ్మం,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)

భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు.

- మిగతా 2 లో..

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

- నార్వే బృందందతో మంత్రి శ్రీధర బాబు

హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)



తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు.

- మిగతా 2 లో..

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

- పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు
- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

నల్గొండ,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)



అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు.

- మిగతా 2 లో..

## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

### - ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం

జనగామ,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)



సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మ బలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళ వారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు.

- మిగతా 2 లో..

## మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం

### - రాహుల్ తీరుపై మండిపడ్డ ఎంపి అరుణ

మహబూబ్‌నగర్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)



లోక్‌సభలో ఇటీవలే మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ ప్రధాన ముద్దాయి అని మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. విపక్షాలతో కలసి మహిళా బిల్లును అడ్డుకుని సాధించేదేంటని అన్నారు. బిల్లు వీగిపోవడంతో అధికార ఎన్డీయే పార్టీలు.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి.

- మిగతా 2 లో..

## అప్పుడు కెసిఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు

### - ఏటిఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్

### - రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు

హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)



కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ. 9వేల కోట్లా? అని ప్రశ్నించారు.

- మిగతా 2 లో..

## తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

### - మోడీని టెర్రరిస్ట్ అంటూ ఎత్తిపొడుపు

### - ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు

### - అలా అనలేని మళ్లీ వివరణ ఇచ్చిన ఖర్గే

చెన్నై,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదంలో చిక్కుకున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో ఆయన క్షమాపణలు చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేసింది అన్నాడీఎంకే-భాజపా పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందన్నారు.

- మిగతా 2 లో..

## తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి



### - పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి

### - మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం

### - ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం

చెన్నై,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా.

- మిగతా 2 లో..

## 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



GENERAL NEWS
22 బుధవారం, ఏప్రిల్ 2026
2
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం దినపత్రిక

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమెప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఏకు ఓటేయండి

మొదటిపేజీ తరువాయి

సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఏ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష పార్టీలకు మహిళలు అంటే చిన్నచూపని, చట్టసభల్లోకి మహిళలు రావడం అంటే ఇష్టం లేదంటూ ఎన్డీయే పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా విపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని ఎంపీ డీకే అరుణ తెలిపారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశం పేరుతో విడగొట్టే చర్యలకు పూనుకుంటున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో హుందాగా వ్యవహరించలేదని, మహిళా రిజర్వేషన్ వల్ల ప్రధాని మోదీకి మంచి పేరు వస్తుందనే అడ్డుకున్నారంటూ ఎంపీ అరుణ మండిపడ్డారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. మహిళలను అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీకి సమయం వచ్చినప్పుడు బుద్ధిచెప్పాలి. జీడీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో అధికంగా సీట్లు పెరగాలనే ఉద్దేశమా అని అన్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనేది కేవలం అపోహనే అన్నారు. ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్ నగర్‌లో పర్యటించనున్నారు. 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్'లో గెలుపొందిన క్రీడాకారులకు గవర్నర్ బహుమతులు ప్రదానం చేస్తారు' అని ఎంపీ అరుణ వెల్లడించారు. ఆయన పర్యటనకు ప్రజలు హాజరు కావాలన్నారు.

# 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరిచారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

# తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రధానమంత్రిని 'టెర్రరిస్టు'గా అభివర్ణించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే నని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారంనాడు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ప్రచార సభలో చేసిన టెర్రరిస్టు వ్యాఖ్యలపై ఖర్గే వివరణ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, సీబీఐ, ఈడీ, ఆదాయం పన్ను శాఖ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఆ సందర్భంలోనే తాను మాట్లాడానని, మోదీని టెర్రరిస్టు అని తాను అనలేదని చెప్పారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. కాంగ్రెస్, డీఎంకే కూటమి సాగించిన ప్రచారంపై మీడియా అడిగినప్పుడు, చాలాబాగా జరిగిందని, అన్ని చోట్ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తమ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖర్గే సమాధానమిచ్చారు. రాహల్ గాంధీ, స్టాలిన్ ఒకే వేదిక నుంచి ప్రచారం సాగించకపోవడంపై అడిగినప్పుడు, ఆ విధంగా చూడకూడదని, ప్రతి ఒక్కరూ ప్లానింగ్ ప్రకారమే ప్రచారం చేస్తుంటారని చెప్పారు. 'నేను ఒకచోట నుంచి ప్రచారం చేస్తే, రాహుల్ మరో చోట ఉంటారు. ఎవరు ఎక్కడ ప్రచారం చేసినా సమష్టి ఆలోచనతోనే ప్రచారం సాగుతుంది. అంతా కలిసికట్టుగా పోరాటం సాగించాం. మేము గెలుస్తాం' అని ఖర్గే సమాధానమిచ్చారు. మోదీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. తాను ఎప్పుడూ మోదీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మైండ్‌సెట్‌కు ఆయన చేసిన వ్యాఖ్యలు అద్దంపడతాయన్నారు. ఆయన నోరుజారి ఈ వ్యాఖ్యలు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన ప్రసంగాల్లో ప్రధానిని నిందిస్తుంటారని, ఈరోజు రాహుల్ తరఫున మల్లికార్జున్ ఖర్గే ఆపని చేశారని అన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ ఒసామా బిన్ లాడెన్‌ను ఒసామాజీ అని, జకీర్ నాయక్‌ను శాంతిదూత అని సంబోధిస్తుంటుందని ఎద్దేవా చేశారు. ప్రధానిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు నిందించినా ప్రజలు శిక్షిస్తూనే వచ్చారని, ఈసారి కూడా ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని అన్నారు.

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ

మొదటిపేజీ తరువాయి

ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ఎ÷-లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో ఖచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

# అప్పుడు కెసిఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# అబద్ధాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

మొదటిపేజీ తరువాయి

క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లకైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
22 బుధవారం, ఏప్రిల్ 2026
3
www.prajaveekshanam.in

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- కిన్నెరసాని వాగులో ఎక్స్‌కవేటర్ స్వాధీనం..

ముగ్గురిపై కేసు నమోదు

**కుక్కునూరు: ఏప్రిల్ 21(ప్రజావీక్షణం)**

ఆంధ్ర–తెలంగాణ సరిహద్దుల్లో అక్రమ ఇసుక దందా సాగిస్తున్న ముఠాపై కుక్కునూరు పోలీసులు మెరుపు దాడి చేశారు. అనుమతులు లేకుండా కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వైనాన్ని గుర్తించి, భారీ ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

**అర్ధరాత్రి వేళ ఇసుక దోపిడీ**

పోలీసుల కథనం ప్రకారం.. కుక్కునూరు మండలంలోని సీతారాం నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో గల కిన్నెరసాని వాగు నుంచి ఆదివారం రాత్రి భారీ ఎత్తున ఇసుక తరలింపు జరిగింది. సుమారు 20 టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తెలంగాణ ప్రాంతానికి తరలించినట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.

**క్షేత్రస్థాయిలో విచారణ**

సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది, మధ్యవర్తులతో కలిసి వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ తవ్విన గుంతల ఆధారంగా భారీగా ఇసుక తరలినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇసుక తవ్వకాలకు ఉపయోగిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఎర్త్ మూవర్స్‌కు చెందిన టాటా హిటాచీ ఎక్స్‌కవేటర్ వాహనాన్ని పోలీసులు అక్కడికక్కడే సీజ్ చేశారు.

**నిందితులపై చర్యలు**

ఈ అక్రమ రవాణాకు పాల్పడినట్లు గుర్తించిన వారిలో
బత్తా అచ్చయ్య యాదవ్ (బూర్గంపాడు మండలం)
పోతనబోయిన చంద్రరావు (బూర్గంపాడు మండలం)
మరియు సదరు వాహన డ్రైవర్‌పై
కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.






# హోటల్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలెండర్ లీక్ అయి ఎగసిపడిన మంటలు ఐదురురికి తీవ్రగాలు ఆసుపత్రి తరలింపు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని వెల్కమ్ హోటల్‌లో మంగళవారం ఉదయం జరిగిన గ్యాస్ పేలుడు సంఘటనలో ఐదుగురు హోటల్ కార్మికులు గాయపడ్డారు. వివరాల ప్రకారం, ఉదయం సుమారు 5:30 ఐదు గంటల ముప్పై నిమిషాల సమయంలో హోటల్‌లో సాంబారు వేడి చేసే క్రమంలో ఇండియన్ గ్యాస్‌కు సంబంధించిన కమర్షియల్ సిలిండర్ గ్యాస్ పైపు అకస్మాత్తుగా పేలి ముక్కలైంది. దీంతో మంటలు చెలరేగి అక్కడ పనిచేస్తున్న కార్మికులు మల్లయ్య, మొబీన్, సుభాష్, గౌస్, సురేష్‌లకు కాలిన గాయాలు అయ్యాయి.గాయపడిన వారిని వెంటనే స్థానికులు సమీపంలోని విజయ హాస్పిటల్‌కు తరలించారు. వీరిలో మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.సంఘటన విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారి ఇన్‌స్పెక్టర్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది రషీద్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ తదితర పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్యాస్ పేలుడుకు గల కారణాలపై గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.రిప్లింగ్ కమర్షియల్ గ్యాస్ వాడడం వలన లీక్ అఇనట్లు సమాచారం.ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.





# అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెల్ ఫోన్లను పంపిణీ చేసిన కార్మిక మైనింగ్

- శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి





**మంచిర్యాల జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజక వర్గంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ టీచర్లకు అందిస్తున్న సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు.అనంతరం మండలంలోని లబ్ది దారులకు కల్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసి.37 మంది లబ్ది దారులకు కల్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరుతుంది.ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి లబ్ది దారులకు ఇవ్వడం జరిగింది.గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ప్రజల సొమ్మును వృథా చేసింది నిన్న నేను సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.బాల్క సుమన్ నేను తెచ్చిన నిధులే ఇప్పుడు ఖర్చు చేస్తున్నారు అని అంటున్నాడు.మరి నిధులు ఉంటే ఎప్పుడూ అభివృద్ధి ఎందుకు చేయలేదో ప్రజలకు చెప్పాలి.నువ్వు ఏమి అభివృద్ధి చేయలేదనే నిన్ను ఒడగొట్టారు ప్రజలు కేవలం సోషల్ మీడియాను అడ్డు పెట్టుకొని ప్రభుత్వం మీద అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నాడు బాల్క సుమన్ నేను గెలిచాక ఇక్కడ అనేక అభివృద్ధి పనులు చేపట్టాను చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను.ఇక్కడ యువతకు ఉపాధి కల్పించడానికి జర్మనీ సంస్థ టామ్ కామ్ తో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది.యువకులు జర్మనీలో ఉపాధి పొందాలంటే మా కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,నాయకులు, మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపల్లె సబ్ జైలు సూపరిటెండెంట్ మన్నెం వెంకటేశ్వరరావు సస్పెండ్

**బాపట్ల : ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల జిల్లా రేపల్లె సబ్ జైలు సూపరిటెండెంట్ మన్నెం వెంకటేశ్వరరావును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీని తెలివిగా బయటికి పారిపోయేందుకు సహకరించినందుకు రూ.60 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నట్లు విచారణలో వెల్లడి కావడంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.రేపల్లె సబ్ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీ అజిత్ కుమార్ ను అనారోగ్యం పేరుతో గుంటూరు జీజీహెచ్ కు తరలించేందుకు జైలు సూపరిటెండెంట్ సహకారం అందించినట్లు విచారణలో వెల్లడైంది.రిమాండ్ ఖైదీ అజిత్ కుమార్ పై గుంటూరు జిల్లా తెనాలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయి ఉంది.అతను బాపట్ల జిల్లా రేపల్లె సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.రిమాండ్ ఖైదీ అజిత్ కుమార్ పరారీ ఘటనలో జైలు సూపరిటెండెంట్ వెంకటేశ్వరరావుపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు.




# రైతుల పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం.. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని పటేల్ గార్డెన్ లో రైతుల పోడు భూముల సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం ఇటీవల నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రైతులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం అందజేసి, తమ పోడు భూముల సమస్యలను వివరంగా విన్నవించుకున్నారు. తమకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేసి, తక్షణ పరిష్కారం కోసం విజ్ఞప్తి చేశారు.రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, "పోడు సమస్య ఈ సారి కాదు, గత 50 సంవత్సరాలుగా మేము ఈ భూములను సాగు చేస్తున్నాము. మాకు ఉన్నది ఈ భూమి ఒక్కటే. మాకు వేరే ఉపాధి తెలియదు. మేము బ్రతికినా, చనిపోయినా ఈ భూమితోనే, ఈ భూమిలోనే ఉంటాము" అని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోడు భూముల సమస్యలు రైతుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, నాయకురాళ్లు, టిఆర్ఎస్ పార్టీ అభిమానులు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.



# జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో మున్సిపల్ కార్మికుడు మృతి

- పని చేస్తుండగానే కుప్పకూలిన పితాని సురేష్..

విషాదంలో కుటుంబం

**జంగారెడ్డిగూడెం:ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

స్థానిక మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తున్న పితాని సురేష్ (55) మంగళవారం ఉదయం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. పట్టణంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.వివరాలు ప్రకారం సురేష్ ప్రతిరోజూ లాగే ఈరోజు ఉదయం కూడా తన శానిటేషన్ డ్యూటీకి హాజరయ్యారు. పనిలో నిమగ్నమై ఉండగా అకస్మాత్తుగా తీవ్రమైన గుండెనొప్పి రావడంతో తోటి కార్మికులు స్పందించే లోపే ఆయన ప్రాణాలు విడిచారు. ఈ సమాచారం తెలియగానే మున్సిపల్ అధికారులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.మున్సిపల్ కమిషనర్ కే. వెంకటరమణ సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒక నిబద్ధత గల కార్మికుడిని కోల్పోవడం పట్ల తోటి మున్సిపల్ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణ పారిశుద్ధ్యం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి ఇలా అకాల మరణం చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది.



# నేడు దేవరకద్ర మండలంలో ఎమ్మెల్యే పర్యటన..

**దేవరకద్ర : ఏప్రిల్ 21( ప్రజా విక్షణం)**



దేవరకద్ర మండలంలో స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి బుధవారం మండల పార్టీ అధ్యక్షులు అంజల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అని ఆయన తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి దేవి మరియు సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ అవిష్క రణలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అని ఆయన చెప్పారు.ఉదయం 11:15 గంటలకు దేవరకద్ర మండలం డోకూర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాలలో రైతులు, మున్సిపాలిటీ చైర్మన్, వైస్ ఛైర్మెన్, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ , మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

# నిస్వార్థసేవే జనసేన లక్ష్యం

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

ఎలాంటి పదవులు, ప్రయోజనాలు ఆశించకుండా నిస్వార్ధంగా ప్రజాసేవ చేయడమే జనసైనికుల లక్ష్యమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ లో బొలిశెట్టి శ్రీనివాస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సేవా సమితి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేసవిలో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారన్నారు. అందుకనుగుణంగా చాలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పట్టణంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. జనసేన, టిడిపి, బిజెపి పార్టీలు సంయుక్తంగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలియజేశారు. బస్టాండ్ కూడలిలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మతో త్వరలో ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. ఈ రహదారికి శివాజీ మార్గమనే నామకరణం చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో తాను ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు తక్షణమే స్పందించి సహకరిస్తున్నారని




ప్రశంసించారు. రాజకీయంగా తాము ఎంత కృషిచేసినా అధికారుల సహకారం ఉంటేనే ముందుకెళ్లగల మని, ఆ విషయంలో పురపాలక, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. నేటి తరానికి దేశభక్తి గురించి అవగాహన కల్పించాలన్నారు. కేవలం మార్కులు, ఉద్యోగం, సంపాదనలకే పరిమితం కాకుండా, దేశభక్తి, త్యాగమూర్తుల గురించి తెలియజేయాలన్నారు దేశాన్ని ఏకతాటిపై నడిపించి చత్రపతిగా కీర్తి పొందిన శివాజీ తదితర మహనీయుల దేశభక్తిని, సేవానిరతిని యువత అధ్యయనం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణే దేశానికి శ్రీరామరక్ష

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

హిందూ ధర్మ పరిరక్షణే భారతదేశానికి శ్రీరామరక్ష అని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్, ఎస్ఎస్ రాజు టౌన్ షిప్ లో నూతనంగా నిర్మించిన గాయత్రి అర్చక సంక్షేమ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వందల సంవత్సరాల పాటు విదేశీయుల దాడులతో హిందూధర్మానికి హాని జరిగిందని, స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితి కొనసాగటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని మతాలను గౌరవించాలని, స్వధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. మతం మారితే ఏదో కలిసి వస్తుందనే భ్రమలు వద్దని, ఏ మతమైనా మనం చేసే మంచి పనుల వల్లే ఉన్నత స్థితి వస్తుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరు విశ్వసించాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణులకు ప్రముఖ స్థానం ఉందని ప్రశంసించారు. హిందూ ధర్మంపై దాడి చేస్తే సహించేది లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుజ్జి రాంప్రసాద్, అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సతీష్, కూటమి నాయకులు ఈతకోట తాతాజీ, నరిసే సోమేశ్వరరావు, సబ్నివీసు కృష్ణమోహన్, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అదనపు ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన చిత్తరంజన్ ఐపీఎస్ ..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న చిత్తరంజన్ ఐపీఎస్, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా పదోన్నతి పొందిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికాపంత్ ఐపీఎస్, చిత్తరంజన్ సింహతలాటం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా బాధ్యతలు స్వీకరించారు. పలువురు జిల్లా పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



# అన్నసమారాదన కార్యక్రమానికి హాజరైన రఘురాం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు సబ్బితి బ్రహ్మయ్య, గొర్రెల శ్రీనివాస్, శంకరం, దారపురెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ జాగృతి సంస్థను ఈ నెల 25వ తేదీన అధికారికంగా ప్రకటించనున్న కల్వకుంట్ల కవిత..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో కల్వకుంట్ల కవిత మార్గదర్శకత్వంలో, తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని, మహిళా శక్తిని మరింత బలపరిచే లక్ష్యంతోతెలంగాణ జాగృతి సంస్థను ఈ నెల 25వ తేదీన అధికారికంగా ప్రకటించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం తెలంగాణ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికే కీలక ఘట్టంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుండి కార్యకర్తలు, ఉద్యమకారులు, యువత,మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. అలాగే ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొనడం మరింత విశేషంగా నిలుస్తుంది. ఆసిఫాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షులు కిరిమిళ్ళ వినోద్ చారి,జాగృతి నాయకురాలు శ్రీమతి సబిత మనోహర్,నర్సింగోజు సాయికుమార్ చారి,నైతం తిరుపతి,యం డి.మోసిన్,మరియు ఇతర జాగృతి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో మనందరం కలిసికట్టుగా ముందుకు సాగితే మాత్రమే తెలంగాణ అభివృద్ధి మరింత బలపడుతుంది. ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు ఇది ఒక ఉద్యమానికి శ్రీకారం. మన తెలంగాణ మన బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగుదాం అని పిలుపు ఇచ్చారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభం...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**


కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ డిగ్రీలో ప్రవేశాలు పొందే విద్యార్థుల కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి దోస్త్ సహాయక కేంద్రాన్ని(హెల్ప్ లైన్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే కళాశాలలోని సహాయక కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొరకు విద్యార్థులు 7013607011,9440194179 ను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహం,జనార్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.




# రెండు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

**దేవరకద్ర ఏప్రిల్ 21 (ప్రజా విక్షణం)**

మండల పరిధిలోని బస్వాపూర్ మరియు గద్దె గూడెం గ్రామాలలో మంగళవారం ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూనేటి అంజిల్ రెడ్డి ,బసాపూర్ సర్పంచ్ శేఖర్ రెడ్డి,నార్లోని కుంట్ల సర్పంచ్ రామ్ రెడ్డి,ఏపీఎం సునీత, విలేజ్ సెక్రటరీ ,మాజీ సర్పంచ్ రామాంజనేయులు,రాఘవులు, బసాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి , రాజేశ్వర్ రెడ్డి , నర్సింలు,రవి, మరియు గద్దె గూడెం గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాఫర్ , సత్యనారాయణ సాగర్ , వేణుగోపాల్ , ఉప సర్పంచ్ , మాధవులు , పూర్ణిత, రాజు, తదితరులు పాల్గొన్నారు.





# పంచాయతీ కార్యదర్శి ని సన్మానం చేసిన బి ఆర్ ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పార్వతి సురేష్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం బారెగూడ మండలం బారేగూడ గ్రామ పంచాయతీలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ కార్యదర్శి చిట్యాల నరేష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించిన బి ఆర్ ఎస్ బారేగూడ సోషల్ మీడియా కన్వీనర్ పార్వతి సురేష్, సిద్ధూ, పాలక్ రావు తదితరులు గ్రామస్థులుఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి చిట్యాల నరేష్ మాట్లాడుతూ, గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



# సిర్పూర్ పేపర్ మిల్స్‌లో క్లోరిన్‌పై మాక్ డ్రిల్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని జె కె పేపర్ మిల్స్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శ్రీమతి కె. హరిత, ఐ ఎ ఎస్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో, శ్రీమతి సి ఎచ్. లక్ష్మీకుమారి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్, నిజామాబాదు వారి ఆధ్వర్యంలో ది సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ లో క్లోరిన్ లీక్ హ్యాండ్లింగ్ పై మోక్ డ్రిల్ మరియు ఎస్ పి ఎమ్ ఉద్యోగులకు క్లోరిన్ వాయువు నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఏ కె మిశ్రా, వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్ ),ఆర్ శ్రీనివాస్, సిఫ్టీ మేనేజర్,ఎం అనిల్ కుమార్, జి ఎం (కమర్షియల్), ఎం స్ గిరి, జనరల్ మేనేజర్ (ఎచ్ & ఐ ఆర్) ఎంప్లాయిస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ కర్మాగారంలలో బాధ్యత ప్రమాణాలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. శ్రీమతి లక్ష్మీకుమారి మాట్లాడుతూ కర్మాగారంలో పనిచేసే అందరికి సేఫ్టీ పై అవగాహన పెంచుకుని ప్రమాదాలను నివారించాలని సూచించారు.ఏ కె మిశ్రా మాట్లాడుతూ సిఫ్టీ మానేజ్మెంటు యొక్క ప్రధమ ప్రాధాన్యత అని తెలియజేసారు.



# మద్దిపాటి రవితేజ దాతృత్వం

## - వీధిలైట్లకు రూ.15వేలు ఆర్థిక సాయం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

రామన్నగూడెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దిపాటి రవితేజ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఆయన తన సొంత నిధులు రూ 15 వేల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు ఆయన గ్రామ కార్యదర్శికి స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా వీధిలైటులను మంగళవారం రవితేజ అందజేశారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో వీధిలైట్ల ఏర్పాటుచేసే నిమిత్తం ఈ సాయం అందజేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని మద్దిపాటి రవితేజ తన సొంత నిధులను పి4లో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి రవితేజ ముందుకురావటం అభినందనీయమని ప్రశంసించారు. యువకులు స్వచ్ఛందంగా తమ గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు ప్రజలకు సేవ చేసే విధంగా రాజకీయాలు చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని ప్రగతిపదంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మద్దిపాటి ధర్మేంద్ర, బేతిన గిరిధర్, పసల కొండ, ఎరుబండి సతీష్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# సమ్మె ఆలోచన విరమించండి

## - చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
## - ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి
## - విభజనపై ఎంపి తేజస్వీ వ్యాఖ్యలపై చంద్రబాబుకు లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

టీజీఎస్ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెను వెంటనే విరమించాలని వారికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మీ సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కార్మికులకు ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసి బలోపేతానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రయాణికుల దృష్టిలో ఆలోచించాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికిప్పుడు చర్చకు తాము సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు వద్దంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొనడం బాధాకరమన్నారు. హైడ్రాను రద్దు చేస్తామంటే కబ్జాదారులకు మద్దతు ఇవ్వడమేనని మంత్రి పొన్నం అభిప్రాయపడ్డారు. జగిత్యాలలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ భారీ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను రద్దు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి వద్దని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల పొన్నం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్‌కు లేఖ రాయాలి. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చూడాలి. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం అని లేఖలో పొన్నం పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల ధర్నా విజయవంతం

# సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన సబ్ కలెక్టర్..





**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 21(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ ఆఫీసు ముందు ఉపాధి హామీ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా విజయవంతంగా జరిగింది.అనంతరం సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌లో ఎక్కడా కనీస సౌకర్యాలు లేవని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.పని ప్రదేశాల్లో కార్మికులకు మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో లేవని, మూడు నెలలుగా వేతనాలు బకాయి పడి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అదేవిధంగా, పని ప్రదేశాల్లో అమలు చేస్తున్న రెండు ఫోటోల విధానం వల్ల అనేక మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని,ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ మెట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, వాచర్లకు సంవత్సరం పొడవునా పని కల్పించాలని, ప్రతి ఉపాధి కూలీకి సంవత్సరానికి కనీసం 200 పనిదినాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసత్ భారత్ జి రామ్ జి విధానం వల్ల కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లుతోందని విమర్శించారు.సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో తక్షణమే మంచినీరు, టెంట్లు, మెడికల్ సదుపాయాలు కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రతి మండల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని, తాను స్వయంగా పని ప్రదేశాలను సందర్శిస్తానని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.కాగజ్ నగర్ ఇన్చార్జ్ ఎంపీడీవో గౌరీ శంకర్ గారిని వెంటనే కనీస సదుపాయాలు కల్పించాలని మందలించారు లేనిపక్షం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది అని అన్నారు నేను నేరుగా పని ప్రదేశాలు వస్తాను అన్ని ఉండాలి.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బొర్కుట్ రాజేందర్, సిఐటియు జిల్లా కార్యదర్శి జాదవ్ రాజేందర్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు పండుగ రాజేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, వాచర్లు పాల్గొన్నారు.

# పెద్దదస్తగిరి హత్యపై సిబిఐతో విచారణ చేయించండి

## - ప్రస్తుత విచారణ అధికారిపై నమ్మకం లేదు
## - మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి భార్య దీప్తి

**కడప,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

రియల్ ఎస్టేట్ వ్యాపారి, వైసిపి నేత పెద్ద దస్తగిరి హత్యలో తన భర్త మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని ఆయన సతీమణి బండి దీప్తి వెల్లడించారు. మంగళవారం అంగడి వీధిలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద దస్తగిరి హత్య కోణం, హత్య విచారణ కోణం వేరువేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. తన భర్తకు పెద్ద దస్తగిరికి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఎటువంటి వ్యాపార లావాదేవీలు లేవని చెప్పారు. పెద్ద దస్తగిరి ఇంట్లో నూరు కోట్లు విలువ చేసే డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారని, ఇందులో ఒక లక్ష రూపాయలైనా,ఒక సైట్ అయినా దస్తగిరితో తన భర్త అగ్రిమెంట్ చేసుకోలేదని పేర్కొన్నారు. అలా లావాదేవీలు ఉన్నట్లు నిరూపించాలని తెలిపారు. పెద్ద దస్తగిరి హత్య జరిగిన వారం తర్వాత విచారణ అధికారిని మార్చివేశారని చెప్పారు. ప్రస్తుత ఉన్న అధికారిపై తనకు అనుమానం ఉందన్నారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్లు గత అనుభవాల దృష్ట్యా అర్థం అవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసిపి ని, తన భర్తను టా÷-గ్గ్ం÷ట్ చేసినట్లు భావిస్తున్నామన్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. భర్త నిత్యానందరెడ్డి తనకు అందుబాటులోకి వస్తే మీడియా సమక్షంలో లొంగిపోవాలని చెబుతానని పేర్కొన్నారు. నిజా నిజాలు నిర్ధారణ కాకుండానే తన భర్తను బలి పశు వును చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిబిఐ, సిట్ తో విచారణ చేయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న విచారణ అధికారిపై తమకు నమ్మకం లేదని తెలిపారు. ఎస్పీ తమ అభ్యర్థనను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. 16 సంవత్సరాల వైవాహిక జీవితంలో తన భర్త ఎలాంటివాడో నాకు బాగా తెలుసునని కన్నీటి పర్యంతమయ్యారు. విచారణకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు.



# అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించిన మంత్రుల బృందం

**సింగపూర్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

వివిధ అంశాలపై శిక్షణ కోసం సింగపూర్ వెళ్లిన ఏపీ మంత్రులు అక్కడి అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించారు. అక్కడి థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మాల్స్, ఫెస్టివ్ ఆర్ట్ థియేటర్‌ను మంత్రుల బృందం పరిశీలించింది. వాటి విశేషాలను అక్కడి అధికారులు మంత్రులకు వివరించారు. వివిధ రంగాల్లో పలు అంశాలను వివరించారు. మంత్రుల బృందంలో నారాయణ, అనిత, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి ఉన్నారు. అక్కడి ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను సింగపూర్ అధికారులు మంత్రులకు వివరించారు.సింగపూర్‌లో ఆధునిక పరిపాలనా విధానాలను, మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఈ బృందం అధ్యయనం చేయనుంది. సింగపూర్ ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్‌తో 'సింగపూర్-ఎపి జాయింట్ ఇన్స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్' అవగాహనా ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా సింగపూర్ పాలనా నమూనా, రాజకీయ జవాబుదారీతనం, నేషన్ ఫస్ట్ వంటి నాయకత్వ సూత్రాలపై నిర్వహించే 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' శిక్షణా కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటున్నారు.

# ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

## ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి
## కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**



భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా ఏటా రూ.22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

# గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న 29 మంది ముద్దాయిలు అరెస్టు

## - 1.50 లక్షల రూపాయలు విలువ గల 2.75 కేజీల గంజాయి, 23 మొబైల్ ఫోన్లు,రూ.15.500 ల నగదు సీజ్

## - కేసు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

**బాపట్ల : ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం) :**

జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా గంజాయి విక్రయించినా,రవాణా చేసినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ హెచ్చరించారు.మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వీసీ హాల్ నందు జిల్లా ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు.గంజాయి సంబంధిత కేసులో 29 మంది ముద్దాయిల అరెస్టుకు సంబందించిన వివరాలను వెల్లడించారు.బాపట్ల పట్టణంలోని అరవపాలెం స్మశానం వద్ద 6 గురు,బాలకృష్ణపురం శ్మశాన కాలువ వద్ద 7 గురు,జమ్ములపాలెం రోడ్డులో గల డంపింగ్ యార్డు వద్ద 8 మందిని,ఉప్పరపాలెం శ్మాశాన వాటిక వద్ద 8 మందిని మంగళవారం బాపట్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎస్పీ తెలిపారు.ఈ క్రమంలోనే రైళ్లలో సోదాలు,జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ లు నిర్వహించడంతో పాటు గతంలో గంజాయి సంబంధిత నేరాలకు పాల్పడిన నిందితులపై, పాత నేరస్తులపై,రౌడీషీటర్ లపై నిఘా ఉంచడం జరిగిందన్నారు.ఏ1 ముద్దాయి అత్తుమూరి ప్రేమ్ కుమార్ పై గతంలో బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2,చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గంజాయి కేసులో నిందితుడిగా ఉండడంతో పాటు అతనిపై సస్పెక్ట్ సీట్ ఉండడం వల్ల అతని కదలికలపై,బాపట్ల పట్టణంలోని రౌడీ షీటర్ షేక్ ఫిరోజ్ గాంధీ కదలికలపై నిఘా ఉంచడం జరిగిందన్నారు.వీరు బాపట్ల పట్టణంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతూ,సేవిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.ఈ క్రమంలో బాపట్ల డీఎస్పీ సీ హెచ్ చంద్రమౌళి ఆధ్వర్యంలో బాపట్ల పట్టణ సీఐ ఆర్.రాంబాబు వారి సిబ్బందితో 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీసులకు రాబడిన కచ్చితమైన సమాచారం మేరకు బాపట్ల ఐటీ కోర్ విభాగం వారు అందించిన సాంకేతిక పరిజ్ఞానంతో బాపట్ల పట్టణ పరిధిలో అరవపాలెం శ్మాశానం వద్ద రైడ్ చేసి మొదటి 6 మంది ముద్దాయిలను మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకుని మొదటి ముద్దాయి అత్తుమూరి ప్రేమ్ కుమార్ ను విచారించిన మీదట అతడు 4 రోజుల క్రితం విజయనగరం ఒరిస్సా సరిహద్దులలోని సరోజ్ ఖరా అను అతని వద్ద నుండి 3 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ధన్ బాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో బాపట్లకు వచ్చి ఏ2 నుండి ఏ 29 వరకు ఉన్న ముద్దాయిలకు ఫోన్ పే ద్వారా మరియు నగదు ద్వారా అమ్ముకుంటూ మరియు సేవిస్తూ ఉండినట్లు వెల్లడించారు.29 మంది ముద్దాయిల వద్ద నుండి ఒక లక్షల యాభై వేల రూపాయలు విలువ గల 2.75 కేజీల గంజాయి,23 మొబైల్ ఫోన్ లు,





రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.జిల్లాలో ఎవరైనా గంజాయి విక్రయించిన, రవాణా చేసిన,వినియోగించిన చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటా మని,అవసరమైతే పీడీ యాక్ట్ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.బాపట్ల డీఎస్పీ సీ హెచ్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ముద్దాయి లను అత్యంత చాకచాక్యంగా పట్టు కోవడంలో ప్రతిభ కనబరచిన బాపట్ల పట్టణ సీఐ ఆర్.రాంబాబు,పట్టణ ఎస్ఐ ఎం.విజయ్ కుమార్,పట్టణ మహిళా ఎస్ఐ షేక్ నస్రీన్,ఏఎస్ఐ లు షేక్ కరీముల్లా,బ్రహ్మం,హెడ్ కాని స్టేబుల్లు హెచ్. వెంకటేష్, జీ.గోపెశ్వరరావు, బి. మనోజ్,కానిస్టేబుల్ పీ. శివబాబు, పీ.మురళి కృష్ణ, కృష్ణరావు,ఏఆర్ కానిస్టేబుల్ లు యాకోబు ( డ్రైవర్ ), వెంకటేష్ ( డ్రైవర్ ), హోం గార్డ్ ఎస్.కృష్ణ,కిషోర్ లను జిల్లా ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డులను అందజేశారు.

# పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

పోలీస్ అధికారులకు పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. వరంగల్, జనగామ ఏ.ఎస్పీ గా పనిచేస్తూ పరిపాలన విభాగం అదనపు ఎస్పీ లుగా పదోన్నతులపై బదిలీపై వెళ్తున్న ఏ.ఎస్పీలు, శుభం ప్రకాష్, చేతన్ నితిన్ లను మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయము లో వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన డిసిపిలు, ఎసిపిలు, ఇతర పోలీస్ అధికారులు బదిలీపై వెళ్తున్న ఇరువురు ఏ.ఎస్పీ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న ఇరువురు అధికారులకు అభినందనలు తెలియజేస్తూ ఇరువురు అధికారులు అప్పగించిన పనులు సమర్థ వంతంగా నిర్వహించడంతో పాటు, నేరాల నియంత్రణలో వారి ప్రత్యేకత చాటుకున్నారని, అదే విధంగా శాంతి భద్రత విషయంలో ఇరువురు అధికారులు సంబందిత అధికారుల సమన్వయంతో పనిచేస్తు చక్కటి ఫలితాలను రాబట్ట గలిగారని, వీరు తీసుకున్న నిర్ణయాలతో ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, ప్రజల అభిమానాన్ని సంపాదించారని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.ఈ కార్యక్రమములో డిసిపిలు అంకిత్‌కుమార్, రాజ మహేంద్రనాయక్, ధార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనీషా నేహ్రా, అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్ తో పాటు, సంబంధిత డివిజన్లకు చెందిన ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, సబ్ ఇన్స్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




# పంజాల బిట్టు చరిత్ జ్ఞాపకార్థమై స్నాక్స్ పంపిణీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)**

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట గ్రామం లో గత నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన పంజాల బిట్టు (చరిత్) జ్ఞాపకార్థమై బిట్టు తల్లి దండ్రులు పంజాల భూపాల్ గౌడ్, నాగలక్ష్మీ, కుటుంబ సభ్యులు మంగళ వారం హన్మకొండ లోని మల్లికంబ మనోవికాస కేంద్రం లో ఉన్న పిల్లలకు స్నాక్స్, సమోసా అందజేయడం జరిగింది. అనంతరం అకాల మరణం చెందిన పంజాల బిట్టు (చరిత్) ఆత్మ కి శాంతి, చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్య క్రమంలో పోలేపల్లి రాజు మైకెల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కనికళ్ల వారి వివాహ వేడుకలో రాజకీయ సందడి

## - నూతన వధూవరులను ఆశీర్వదించిన 'ఎల్లిన వెంకటరత్నం'

**జంగారెడ్డిగూడెం :ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

కనికళ్ల వారి కుటుంబంలో జరిగిన వివాహ వేడుక మంగళవారం అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకకు రాజకీయ ప్రముఖుల రాకతో పెళ్లి పందిరిలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి మాజీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లిన వెంకటరత్నం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివాహ వేడుకకు విచ్చేసిన ఎల్లిన వెంకటరత్నం కి కనికళ్ల కుటుంబ సభ్యులు మరియు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న ఆయన, నూతన వధూవరులను అక్షింతలు వేసి దీవించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాహ బంధం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన బంధమని, నూతన దంపతులు అన్యోన్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఎల్లిన వెంకటరత్నంతో పాటు ఈ కార్యక్రమంలో:

సాధన నరసింహారావు,

తమ్మిశెట్టి శ్రీను,తదితర ముఖ్య నేతలు పాల్గొని సందడి చేశారు. నాయకులందరూ ఒకే చోట చేరడంతో పెళ్లి వేడుక కాస్తా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.తమ ప్రియతమ నేత ఎల్లిన వెంకటరత్నం పెళ్లికి వచ్చారని తెలుసుకున్న స్థానిక



కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఆయనను కలిసేందుకు, ఫోటోలు దిగేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపించారు. అందరినీ పేరుపేరునా పలకరిస్తూ వెంకటరత్నం తనదైన శైలిలో ఆత్మీయతను చాటుకున్నారు. వధూవరుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ ఇంటి శుభకార్యానికి పెద్దలు, ప్రముఖులు విచ్చేసి ఆశీర్వదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విందు వినోదాలతో పాటు, ప్రముఖుల రాకతో ఈ వివాహ వేడుక ఆ ప్రాంతంలో ఒక మరుపురాని ఘట్టంగా నిలిచిపోయింది.

# ఖర్గేవి దిగజారుడు వ్యాఖ్యలు

## - బాధ్యతాయుతమైన వ్యక్తి ఇలాంటి మాటలా

## - మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 21(ప్రజా వీక్షణం)**

ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడిగా ఖర్గేకు పేరు ఉందని ప్రస్తావించారు. బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై.. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఖర్గే.. మోదీపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోదీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు.. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున్ ఖర్గే గుర్తుపెట్టుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. రాజకీయాల్లో మరీముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని.. కానీ ఈ ప్రయత్నంలో వ్యక్తిగత దూషణలకు చోటులేదని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ కావాల్సినంత విషం కక్కారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు తమను ద్వేషిస్తున్నారని తెలిసి ఆవేదనతో, ఆక్రోషంతో ప్రధానమంత్రి మీద ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

## - 95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి

**హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
22 బుధవారం, ఏప్రిల్ 2026
7
www.prajaveekshanam.in

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

## - రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్ధలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

## కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
## హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
## కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
## కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే దిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరపున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరపున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి దిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# హాష్ అయిల్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

## - కోట్ల విలువ గల హాషీష్ ఆయిల్ స్వాధీనం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో ఎప్పుడు లేని తోలిసారిగా భారీ స్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుండి తీసిన నూనె) స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాలోని నలుగురు సభ్యులను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా కలసి అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 2 కోట్ల 50లక్షల విలువ గల హాష్ ఆయిల్‌తో రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో
1). హంటల్ సన్ను (23), సువ్వపల్లి గ్రామం, చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం,
2).హంటల్ సన్యాసి (23), రేకపల్లి, చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషా రాష్ట్రం,
3). కండెల చిన్నబాబు (56), దారకొండ గ్రామం, గూడెం మండలం, అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, 4).కష్ణా హంటల్ (56), రేకపల్లి, చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషా రాష్ట్రానికి చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీ వున్నాడు.
ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను తెలియజేస్తూ పట్టుబడిన నిందితులందరు పరిచయస్తులు కాగా, ఇందులో ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామం లో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగితా నిందితుల ద్వారా విక్రయించి సోమ్ము చేసుకుని జల్సాలకు చేసేవారు. కాని నిందితులకు గంజాయి విక్రయాలతో వచ్చే డబ్బు వారి జల్సాలకు సరిపోక పోవడంతో ప్రధాన నిందితుడు గంజాయి మొక్కల నుండి హాష్ అయిల్ ను తయారు చేసే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో వున్న కిలో పాండు నిందితుడి తో పరిచయం కావడంతో, పాండు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన నిందితుడు మిగితా నిందితుల తో కలసి గంజాయి మొక్కలను పెంపకం చేపట్టిన అనంతరం, నిందితుడు పాండు తీసుకవచ్చిన పరికరం ద్వారా ఈ ముఠా సభ్యులు గంజాయి మొక్కలను ద్వారా 40 కిలోల హాష్ అయిల్ ను సేకరించారు. ఈ విధంగా తయారు చేసిన హాష్ అయిల్ లో 20 కిలోల హాష్ అయిల్ ను పాండు తీసుకోగా, మిగితా 20కిలోల హాష్ అయిల్‌ను కిలో చోప్పున ప్యాకేట్లలో భద్రపర్చి పట్టుబడిన నిందితడులందరు ఐదు కిలోల చోప్పున హాష్ అయిల్‌ను తీసుకోని ముంబాయిలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ తుని రైల్వే స్టేషన్ నుండి ఈ నెల 19 తేది అర్ధరాత్రి కోనార్క్ రైలులో బయలు దేరారు. వరంగల్ రైల్వేలో పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా ముఠా అనుమానం రావడంతో ఈ ముఠా సభ్యులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిన్నటి రోజు దిగిన నిందితులు మంగళవారం ఉదయం ముంబాయి వేళ్ళేందుకు వరంగల్ బస్టాండ్ వద్ద వున్న రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమాస్పదంగా తిరుగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో నిందితులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారివద్ద హాష్ అయిల్‌ను గుర్తించిన పోలీసులు నిందితులను అరెస్టు చేసిన 20 కిలోల హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున హాష్ అయిల్‌తో పాటు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, వరంగల్ ఏఎప్పీ శుభం, ఏసిపి లు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, డ్రగ్ కంట్రోల్ టీం ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షూకూర్, ఎస్.ఐలు సందీప్, తేజ ఆర్.ఎస్.ఐలు ఏ.పూర్ణ చందర్ రెడ్డి,కె.మనోజ్ రెడ్డి, ఎల్.లింగారావు,క్యాట్ పార్టీ ఏ.ఆర్.ఏ.ఎస్.ఐలు వి.సుబ్బిరామి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బాల రాజు, కె.శ్రీరాములు, యం.డి రబ్బానీ, ఆర్.రాజ్‌కుమార్ తో పాటు ఇంతేజార్‌గంజ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం







ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రపంచ ధరిత్రీ దినోత్సవం ఏప్రిల్ 22 (నేడు) పురస్కరించుకుని 66 వ డివిజన్ కేంద్రంలో ని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి యందు ధరిత్రీ దినోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ని జన్మలెత్తినా నేలతల్లి రుణం తీర్చుకోలేము ఒక్క మొక్కను నాటి పుడమి తల్లి ఆయుష్షును పెంచుదాం అని అని చెబుతూ ఈ సంవత్సరము ధరిత్రీ దినోత్సవం 2026 మన శక్తి మన గ్రహం అనే అంశం మీద 2030 నాటికి మనము పరిశుభ్రమైన విద్యుత్తును మూడు రెట్లు పెంచేలా పునరుత్పాదక శక్తి చుట్టూ అందరూ ఐక్యంగా ఉండాలని ఐక్యరాజ్యసమితి పిలుపు నిచ్చినది భూమిపై విచ్చల విడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ పదార్థములు, అడవుల నరికివేత వలన వాతావరణం లో క్లోరో ఫ్లోరో కార్బన్లు పెరిగి గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి విపరీతమైన భూతాపం పెరిగి మానవ జీవనంతో పాటు పశు పక్షాదులు ఇతర ప్రాణులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్న సందర్భంగా 1970 వ సంవత్సరం నుండి ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరము ఏప్రిల్ 22వ తేదీని ధరిత్రి దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించారు. 195 దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం జరుగుతున్నది ప్రస్తుతము అడవులు అంతరించి పోవడం ప్రజలు విచ్చల విడిగా ప్లాస్టిక్ వినియోగించడం గ్లోబల్ వార్మింగ్ పెరిగి వాతావరణ అసమతౌల్యం ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు డిహైడ్రేషన్ రోగములు విష జ్వరాలు చర్మ క్యాన్సర్లతో తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతున్నది. ఈ భూతాపం పెరిగి గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వలన ఓజోన్ కొరకు రంధ్రం ఏర్పడి సూర్యుడు నుండి వచ్చే అతినీల లోహిత కిరణములు భూమిపై ప్రసరించి అనేక జీవరాశులకు ప్రమాదం ఏర్పడుతున్నది కాలచక్రం మారి అకాల వర్షములు తుఫానులు భూకంపములు ఏర్పడుతున్నాయి దీనివలన ప్రపంచ దేశాలు ఆర్థికంగా నష్టపోయి పంటలు పండక ఆహార కొరత ఏర్పడే ప్రమాదమున్నది కావున మనందరం సమిష్టిగా మనం నివసిస్తున్న ఈ భూమిని కాపాడుకోవడానికి ఈ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చినారు. మన పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఎన్జిసి ఆధ్వర్యం లో గత 30 సంవత్సరములు గా పర్యావరణ పరిరక్షణకు గ్లోబల్ వార్మింగ్ తగ్గించడానికి చెట్లను నాటి వాటిని సంరక్షించడం ప్రజలకు కల్పించడానికి కర పత్రములు ర్యాలీల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతున్నది .ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాస్కులు ధరించి ప్లాస్టిక్ భూతము నిర్మూలించుటకు ప్లాస్టిక్ సీసాలతో హారము మెడలో ధరించి బ్యానర్ల ద్వారా ప్రదర్శన నిర్వహించడం జరిగినది. మనకు మూలాధారమైన భూమాతను కాపాడడానికి పరిశుభ్రంగా ఉంచడానికి పశువులు పక్షులు, జంతువులు మనం ఆరోగ్య కరమైన జీవితం కోసం చెట్లను నాటుదామని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు జూపాక నాగరాజు ఏ. వెంకట్ పి. వెంకటేశ్వర్లు ఈ. ప్రవీణ్ వై. అరుణ సిహెచ్. సంధ్య సుచిత్ర సరిత సబిహా ప్రవళిక మౌనిక జి సంధ్య లావణ్య సుధారాణి పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

## - రైతులను హెచ్చరించిన అధికారులు

## - క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

**రంగారెడ్డి,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు.గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

## - రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది

## - పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి

## - దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది

## - మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు

**అమరావతి,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**



వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

# తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల పక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

# తమిళనాడు తీరప్రాంతానికి వర్షహెచ్చరిక

**చెన్నై,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రీతీరప్రాంతాల్లో మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియ్‌సగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

# త్రిస్సూర్ బాణసంచా పరిశ్రమ పేలుడు ఘటన

## 13కు చేరిన మృతుల సంఖ్య

**తిరువనంతపురం,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)**

కేరళ త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన ఘటనలో మృతుల సంఖ్య 13 కు చేరింది. 30 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్‌లో నిల్వ ఉంచిన బాణసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగింది. స్థానికంగా పంటపొలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ఘటన సమయంలో మొత్తం అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సమీప ప్రాంతాల్లోనూ బాణసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుడు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బృందాలు వెల్లడించాయి. అయితే, అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదానికి ఓ కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులకు సూచించారు. తీవ్రంగా గాయాలైన బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇతర రాష్ట్రాల వైద్య నిపుణుల సాయం తీసుకోవాలని సూచించారు.

# దస్తగిరి హత్యపై ప్రభుత్వం సీరియస్

## - నిత్యానంద రెడ్డి కోసం పోలీసుల గాలింపు

**కడప,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

నగరంలో జరిగిన వైసీపీ కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసుపై ప్రభుత్వం సీరియస్ అయింది. పోలీసులు లోతుగా విచారణ చేస్తూ కేసును అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. హత్య వెనుక ఉన్న కారణాలను బయటపెట్టడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దస్తగిరి హత్యతో సంబంధం ఉన్న వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నిత్యానంద రెడ్డిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి విచారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.హతుడు పెద్దదస్తగిరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో వైసీపీ నేతలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 145 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఈ భూముల మొత్తం విలువ 100 కోట్ల రూపాయలకు పైగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నివాసంలో గత రాత్రి నాలుగు గంటల పాటు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు చేపట్టిన విచారణతో వైసీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది.

# మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

## - ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఏదీ

## - ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్ధతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 22 నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన పక్రియ ఇప్పటికీ మొదలుపెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారంలోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ చైర్మన్ వెంకన్న. సమ్మె చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అందరూ సమ్మె చేయడానికీ సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# పెద్దదస్తగిరి హత్యపై సిబిఐతో విచారణ చేయించండి

## ప్రస్తుత విచారణ అధికారిపై నమ్మకం లేదు

## మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి భార్య దీప్తి

**కడప,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)**

రియల్ ఎస్టేట్ వ్యాపారి, వైసిపి నేత పెద్ద దస్తగిరి హత్యలో తన భర్త మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని ఆయన సతీమణి బండి దీప్తి వెల్లడించారు. మంగళవారం అంగడి వీధిలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద దస్తగిరి హత్య కోణం, హత్య విచారణ కోణం వేరువేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. తన భర్తకు పెద్ద దస్తగిరికి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఎటువంటి వ్యాపార లావాదేవీలు లేవని చెప్పారు. పెద్ద దస్తగిరి ఇంట్లో నూరు కోట్లు విలువ చేసే డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారని, ఇందులో ఒక లక్ష రూపాయలైనా,ఒక సైట్ అయినా దస్తగిరితో తన భర్త అగ్రిమెంట్ చేసుకోలేదని పేర్కొన్నారు. అలా లావాదేవీలు ఉన్నట్లు నిరూపించాలని తెలిపారు. పెద్ద దస్తగిరి హత్య జరిగిన వారం తర్వాత విచారణ అధికారిని మార్చివేశారని చెప్పారు. ప్రస్తుత ఉన్న అధికారిపై తనకు అనుమానం ఉందన్నారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నట్లు గత అనుభవాల దృష్ట్యా అర్థం అవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసిపిని, తన భర్తను టా÷-గ్గ్ం÷ట్ చేసినట్లు భావిస్తున్నామన్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగేందుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. భర్త నిత్యానందరెడ్డి తనకు అందుబాటులోకి వస్తే మీడియా సమక్షంలో లొంగిపోవాలని చెబుతానని పేర్కొన్నారు. నిజా నిజాలు నిర్ధారణ కాకుండానే తన భర్తను బలి పశువును చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిబిఐ, సిట్ తో విచారణ చేయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న విచారణ అధికారిపై తమకు నమ్మకం లేదని తెలిపారు. ఎస్పీ తమ అభ్యర్థనను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. 16 సంవత్సరాల వైవాహిక జీవితంలో తన భర్త ఎలాంటివాడో నాకు బాగా తెలుసునని కన్నీటి పర్యంతమయ్యారు. విచారణకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు.

ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్షేమం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకులు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఏపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# పార్లమెంటునేలుతున్న దండం సెంగోల్

ప్రజాస్వామిక ప్రభుత్వం రాజరికపుటాచారాలను కొత్తగా ఇపుడు స్వీకరించడం అనుచితం. తగని పని. ఒక మతచిహ్నం రాజ్యాధికార లాంఛనమా? అయితే మిగతా మతాల సంగతేమిటి? ఇంకా ప్రజాస్వామ్య ప్రభుత్వానికి రాచరికపు వాసనలు పోలేదు. ప్రజాస్వామిక సంస్కృతి అలవడనే లేదు.

ఇంకా రాచరికాల పేర్లే చలామణిలో ఉన్నాయి. ఎందుకో ప్రత్యామ్నాయాల కొరకు ప్రయత్నించలేదు. పాత అలవాట్లు వదులుకోలేదు. మళ్ళీ రాజరికపు మాయముంతలోంచి రాజదండం ప్రత్యక్షమైంది. ఎటువైపు మన ప్రజాస్వామ్యం. ఎందుకీ మార్పు?

ఇట్ల దండాన్ని ధరించడం రాచరికపు ఆనవాయితీ. రాజచిహ్నాలలో ప్రధానం. అధికారానికి గుర్తు. రాజదండమే రాజుకు అధికారాన్నిస్తుందని నమ్మిక. రాజుగా ఏలబోయే ఉత్తరాధికారి 'దండ గ్రహణం' చేయాలి.


ఆచారం. పండితులు, గురువులు, పూజారులు, అధికారులు ధరించేవి కూడా దండాలే. వేద కాలంలోనే ధర్మదండం వుండేదని దాన్ని 'మిత్రవరుణ దండమంటా'రని ప్రసిద్ధ చరిత్రకారిణి రేఖారావుగారు రాసారు.

శివుని చేతిలో 'సెంగోల్' ఉండేదా? పట్టడక్కల్ లోనే తాండవ శివుని చేతిలో కనిపిస్తున్నది.( విరూపాక్ష దేవాలయం పట్టడకల్, 8వ శతాబ్దం ) దండం చివర నంది ఉండడం విశేషం.


శివుడు తన వాహనమైన నంది ఉన్న దండాన్నెందుకు ధరించాడు. శివుని తాండవానికి ఆ పేరు రావడానికి శివుడు తన ప్రధాన పరివారజనుడైన 'తండు'నికి నాట్యవిన్యాసమైన ఊర్ధ్వజాను కరణాన్ని బోధించాడట. తండునికి బోధించిన నాట్యమే తాండవమైందని రేఖారావుగారి వివరణ. తండుడే ఈ నాట్యశాస్త్రాన్ని భరతునికి బోధించాడు. తండునితో ఉన్నవాడు నంది. నంది అమోఘమైన నాట్యవేత్త. నందిని నందికేశుడని ఈశ్వరునితో సమంగా సంబోధిస్తారు. శైవశాఖలలో నందీశ్వర మతం ఉందని విన్నాను. శివుడు తన నాట్యం ద్వారానే నందికి జ్ఞానబోధ చేసాడని.

కొన్ని దేవాలయాలలోని శిల్పాలలో అధికార నంది ఒకరు. నంది మానవరూపంలో దండం ధరించి, నిలబడి, లేదా ఆసనస్థితిలో కనిపిస్తాడు. నంది అనుమతి లేనిదే శివదర్శనం జరుగదు. నందిదండాన్ని, సెంగోల్ ను శివుడెందుకు ధరించాడు. ఇది కొత్త ప్రతిమాలక్షణం. అంతకుముందు మనకు ఎక్కడా కూడా సెంగోల్ తో కనిపించడు శివుడు. బాదామీ చాళుక్య శిల్పాలలో కొన్ని శిల్పాల వెనక నందితల తప్పనిసరిగా వుండడం చూడవచ్చు. ఇది ఒక సింబాలిక్ ప్రజంటేషన్.

నందివున్న దండాన్ని అధికారదండంగా గౌరవించేది శైవులలో కొందరు. నందిని అధికారనందిగా, అతని చేతిలోని దండాన్ని అధికారదండంగా గౌరవించడం ఒక ఆచారంగా వస్తున్నది. చోళుల పాలనాకాలంలో సెంగోల్ ప్రసిద్ధికెక్కింది. ఈ దండాన్ని కేవలం రాజు మాత్రమే ధరించడం లేదు. గురువులు, మతాధిపతులు ధరిస్తున్నారు. దాన్నిపుడు రాజదండమనడం విశేషం.










# సుందరయ్య రాజీనామా ఎందుకు

## -రణదీవేతో వచ్చిన గొడవేంటి

పుచ్చలపల్లి సుందరయ్య.. పరిచయం అక్కర్లేని పేరు. పొగడ్తలకీ, భుజకీర్తులకీ పొంగిపోని మనీషి. తిండీ తిప్పలకు కటకటలాడే కూలీనాలీకి గొంతుక. అలో రామచంద్రా అంటూ అల్లాడే బడుగు బలహీనవర్గాలకు అండాదండ. ఎర్రజెండా అంటే పీక్కోసుకునే వారి ముద్దుబిడ్డ. అందరూ పిలుచుకునే పేరు సుందరయ్య. పార్టీ వర్గాలకు పీఎస్. మార్క్సిజం పొడగిట్టని వాళ్లకు కమ్యూనిస్టు గాంధీ. పుట్టింది– ప్రపంచవ్యాప్తంగా ఎర్రజెండా ఎగిసిపడే మేడే నాడు. 72 ఏళ్ల బతుకులో– తెలివిడి వచ్చిందగ్గర్నుంచీ తన కోసం కాకుండా పరుల కోసం– అర్ధశతాబ్దానికిపైగా పరితపించి 1985 మే 19న ఎర్రజెండాను చుట్టుకుని అరమరికలు లేని అధోజగత్ ను దేవులాడుకుంటూ వెళ్లిపోయారు. అనేకానేక చారిత్రక సంఘటనల రూపశిల్పి. సమాజ మూల మలుపులకు ప్రత్యక్ష సాక్షి. ప్రత్యేక వ్యక్తిత్వాన్ని వదులుకుని సమష్టి వ్యక్తిత్వాన్ని అలవరచుకున్న వారు. కల్లోల సంధ్యలో సంఘర్షణ పడిన వారు. సరిగ్గా ఆయన వర్ధంతి నాడే నా చేతికో పుస్తకం అందింది. దాని పేరే సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి నా రాజీనామా.

...

గుర్రం విజయకుమార్. సీపీఐ ఎంఎల్ నాయకుడు. సిద్ధాంతం చదివిన వారు. ఆయన నాకీ పుస్తకం ఇమ్మన్నారంటూ– ఆయన మిత్రుడు, నాకూ పరిచయమున్న– ముప్పాళ్ల భార్గవ శ్రీ ఫోన్ చేశారు. విజయవాడ ఏలూరురోడ్డులోని విశాలాంధ్రలో ఇవ్వండి నేను తీసుకుంటానని చెప్పా. అనుకున్నట్టే ఆయన అక్కడిచ్చిన పుస్తకాన్ని ఆ సాయంత్రం తెచ్చుకున్నా. సుందరయ్య వర్ధంతినాడే ఈ పుస్తకం నా చేతికందడం కాకతాళీయమే కావొచ్చు కానీ గుర్రం విజయ్ కుమార్ నాకు ఎందుకిమ్మన్నారో తెలియదు. కమ్యూనిజమంటే మోజే తప్ప చదివింది తక్కువ. వృత్తిధర్మంలో భాగంగా చాలా ఏళ్లపాటు కమ్యూనిస్టు పార్టీల వార్తలు రాశా. బహుశా అదే కారణమై ఉండొచ్చు. పార్టీ అంతర్గత వ్యవహారాలు, కుమ్ములాటలు, రాజీనామాలాంటి వార్తలంటే పత్రికలకు, విలేఖర్లకు మక్కువెక్కువ. చాలా సందర్భాలలో నేనూ అలాంటి తుంటరి వార్తలు రాసి కొందరి చీవాట్లు, మరికొందరి మెచ్చుకోళ్లు పొందా. అది కూడా కారణమేమో. ఏమైతేనేం, డబ్బులు ఎవరికీ ఊరికే రావన్న యాడ్ కి భిన్నంగా ఈ పుస్తకం నాకు ఉద్దరగానే దక్కింది.

.....

1970–1980ల మధ్యకాలం.. దేశానికి గడ్డుకాలం. రైతాంగ పోరాటాలు, ఎత్తుగడల పంథాలు సన్నగిల్లాయి. అధికారమే సర్వస్వమైంది. కాంగ్రెస్ కు పోటీ కమ్యూనిస్టులనే భావన సడలింది. మతమంటూ శివాలెత్తినోళ్లు ఓ పక్క, మితిమీరిన దేశభక్తులొకపక్క. ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ పెట్టింది. తిట్టినోళ్లందర్నీ ఈడ్చిఈడ్చి కొట్టింది. గొంతెత్తితే పీకమీద కాలేసి తొక్కినంత పన్జేసింది. జైళ్లు నిండాయి. కీచు గొంతుకలు తప్ప పెద్ద నోళ్లు మూతపడ్డాయి. ఆ ఎమర్జెన్సీ కమ్యూనిస్టుల్లోనూ కలతలు రేపింది. కక్కా, మింగాలేకుండా చేసింది. మితవాదుల సడుగులిరిగాయని సంతోషపడాలో జనశక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉడిగాయని బాధపడాలో తెలియని సందర్భం.

1975 ఆగస్టు 22... రాజీనామాపై..


ఈ తేదీకి ముందే అంటే 1975 జూన్ లోనో జూలైలోనో పుచ్చలపల్లి సుందరయ్య సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1975 ఆగస్టు 8న ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో సుదీర్ఘంగా వివరించారు. అందుకే ఈ పుస్తకం 128 పేజీలైంది. ఎవరెవరితో ఏయే విషయాలపై ఘర్షణ పడాల్సి వచ్చిందో, ఎందుకు పడాల్సివచ్చిందో రాశారు. అయితే ఇవన్నీ దేశాన్ని ఎలా నడపాలనే దానిపై అభిప్రాయభేదాలే తప్ప సొంత ఆస్తుల కోసమో పదవుల కోసమో వచ్చినవి కావు. మొత్తం పది అంశాలపై సుందరయ్యకి పొలిట్ బ్యూరోతో, కేంద్రకమిటీతో తేడాలున్నట్టు తేల్తుంది. చదవాలనుకునే వారికి వీలుగా ఈ వివరణలుంటాయి. మాకినేని బసవపున్నయ్య అప్పటికే పొలిట్ బ్యూరోను వదిలేసి విజయవాడ వచ్చారు. మరో పొలిట్ బ్యూరో సభ్యుడు రామమూర్తి రాజీనామా చేశారు. బీటీ రణదీవేతో సుందరయ్యకు ఘర్షణ ఉంది. పార్టీలో మనసిప్పి మాట్లాడుకునే స్థితి లేదు. రాజకీయ, నిర్మాణ సమస్యలపై ఒకే మాట మీదుండే పొలిట్ బ్యూరోలో, కేంద్ర కమిటీలో బలం లేకుండా పోయింది. దీంతో సుందరయ్యను ఒంటరితనం వెంటాడింది. వాటన్నింటి ఫలితమే రాజీనామా అంటూ సుందరయ్య రాసుకొచ్చారు.

సుందరయ్య ఏమన్నారంటే...

ఆయన ఏమన్నారంటే..." అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాటడమనే పేరిట సామ్రాజ్యవాద అనుకూల, అర్ధ సైనిక ఫాసిస్టు ఆర్.ఎస్.ఎస్. గుండెకాయగా ఉండే జనసంఘ్ తో సమష్టి పోరాటాలకు అనుకూలంగా కేంద్ర కమిటీ మెజారిటీ తీర్మానించింది. అది మన పార్టీకీ, ఇటు దేశంలోనూ, విదేశాల్లో ఉండే ప్రజాస్వామిక సమూహాలలో నష్టదాయకమని, సామ్రాజ్యవాద వ్యతిరేక సోషలిస్టు శక్తులు వేరుపడడానికి దారి తీస్తుందని భావిస్తున్నా... "

"మనం ఒక విప్లవకర పార్టీగా, కార్మికవర్గ పార్టీగా మార్క్సిజం లెనినిజం పునాదిగా ఉన్న మన పార్టీ నిజమైన విప్లవకర పార్టీని నిర్మించే కర్తవ్యాన్ని తీవ్రంగా చేపట్టడం లేదని భావిస్తున్నా"

"పొలిట్ బ్యూరోను ఐక్యపరచలేక పోతున్నా. అనేక సమస్యలపై అంగీకరించలేకపోతున్నా. అందువల్ల నేను పార్టీ, ప్రజా ఉద్యమాల పురోగతికి అడ్డం కావడం లేదు గదా అని రెండేళ్లుగా ఆలోచించి" రాజీనామా నిర్ణయానికి వచ్చారు.




ఎంత మానసిక క్షోభపడి ఉంటారో...

సొంతబిడ్డలా సాకి సంతరించి జవసత్వాలను కూడబెట్టిన పార్టీ పదవులకు రాజీనామా చేయడానికి ముందు ఆయనెంత మానసిక క్షోభ పడి ఉంటారో ఊహించవచ్చు. గత్యంతరం లేని స్థితిలోనే ఆయన ఈ నిర్ణయానికి వచ్చి ఉండవచ్చు. ఆ రాజీనామా పత్రం ఊళ్లలోని కార్యకర్తల వరకు వెళ్లాలని, అందరూ చదవాలని, మాట్లాడాలని కోరుకున్నారు. ఇలా చేయడం ఒక్క కమ్యూనిస్టులకే సాధ్యమవుతుంది. అందువల్లే ఆయన తన రాజీనామా లేఖను పార్టీ పత్రికలోనూ ప్రచురించాలని కోరారు.

తప్పుల్ని దిద్దుకుని ముందుకెళ్లాలంటే...

కమ్యూనిస్టులు ఇప్పుడు కత్తుల వంతెనపై నడుస్తున్నారు. అస్తిత్వ పోరాటం చేస్తున్నారు. ఒకప్పుడు ఇదే సుందరయ్య పార్లమెంటులో నెహ్రూ, పటేల్ మీద మీసం మెలేసినోడు. కాంగ్రెస్ పై కాలుదువ్వినోడు. కానీ నేడెక్కడ? 4వేల మందిని బలిదానం చేసిన తెలంగాణ సాయుధ పోరు గడ్డపై కమ్యూనిస్టుల ఊసు లేదు. 30 ఏళ్లు ఎదురులేకుండా గెలిచిన పశ్చిమ బెంగాల్ లో ఎక్కడ??, త్రిపురలో ఎక్కడ??.. కేరళలో లేకుంటే కమ్యూనిస్టులు కనుమరుగయ్యారని ఊదరగొట్టేవారు..

ఇటువంటి గడ్డుకాలంలో కామ్రేడ్ గుర్రం కోటయ్య మెమోరియల్ కమిటీ (పొన్నెకల్లు, గుంటూరు జిల్లా) ఈ పుస్తకాన్ని తీసుకొచ్చింది. ఎటువంటి వ్యాఖ్యానాలు లేకుండా ఉన్నదున్నట్టు పాఠకుల ముందుంచింది. ఇప్పటికే ఈ పుస్తకం చేరాల్సిన వాళ్లకి చేరింది. చదివి అర్థం చేసుకున్నోడికి చేసుకున్నంత. కమ్యూనిస్టు పార్టీలకు కొత్త జవసత్వాలు ఇవ్వాలనుకునే వారు ఈ పుస్తకాన్ని కచ్చితంగా చదవాల్సిందే. లోపాలెక్కడున్నాయో వెతకాల్సిందే. దాపరికం లేకుండా మాట్లాడాల్సిందే. పూర్వవైభవానికి నిచ్చెన మెట్లు వేయాల్సిందే. పుస్తకం చివరిపేజీలో తరిమెల నాగిరెడ్డికి నివాళులర్పిస్తూ సుందరయ్య చేతిరాతతో రాసిన లేఖ వేయడం బాగుంది. పీఎస్, సీసీ, పీబీ లాంటి అబ్రివేషన్స్ కి పూర్తి పేర్లు ఒక్కసారైనా రాస్తే ఇప్పటివాళ్లకు తెలుస్తుంది.

పుస్తకం కావాల్సిన వాళ్లు కర్నాటి వెంకటరామ్ సెల్ నెంబర్ 9848365778కి ఫోన్ చేయండి. ధర వంద రూపాయలు

ప్రజావీక్షణం
దినపత్రిక

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

## - తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు

## - తాజా రాజకీయ పరిణామాలపై చర్చించే ఛాన్స్

హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

# భవన నిర్మాణదారులకు ఊరట

### ఖాళీ స్థలాల పన్నులో 50శాతం రాయితీ

### పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణదారులకు, భూ యజమానులకు భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఖాళీ స్థలాలపై పన్ను చెల్లింపు విధానంలో సవరణలు చేస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన చట్ట సవరణలకు అనుగుణంగా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ అధికారిక జీవోను విడుదల చేశారు. దీని ప్రకారం భవన నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన ఖాళీ స్థలం పన్నుపై 50 శాతం రాయితీ లభించనుంది. భవన నిర్మాణ అనుమతి పొంది, నిర్మాణం ప్రారంభించిన సమయం నుంచి ఆ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ అయ్యే వరకు ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుంది. గతంలో నిర్మాణం జరుగుతున్న సమయంలో కూడా పూర్తి స్థాయిలో పన్ను చెల్లించాల్సి వచ్చేది, ఇప్పుడు ఆ భారాన్ని ప్రభుత్వం సగానికి తగ్గించింది. మున్సిపల్ చట్టాల్లోని నిబంధనల వల్ల నిర్మాణదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి, సామాన్యులపై భారం తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు చట్ట సవరణ బిల్లును ఆమోదించారు. పెద్ద ప్రాజెక్టులు నిర్మించే సమయంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రావడానికి ఏళ్ల సమయం పడుతుంది. అప్పటివరకు ఖాళీ స్థలం పన్ను భారం సగానికి తగ్గడం వల్ల ప్రాజెక్టు వ్యయం తగ్గుతుంది. వ్యక్తిగత గృహ నిర్మాణదారులకు కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ నిర్ణయం వల్ల భవన నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. నిర్మాణ అనుమతి పొందిన తర్వాత మాత్రమే ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుంది. కేవలం ఖాళీగా ఉంచిన స్థలాలకు (నిర్మాణ అనుమతి లేనివి) యథావిధిగా పూర్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత, ఆ స్థలం పన్ను రద్దయి, భవన పన్ను అమల్లోకి వస్తుంది. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నిర్మాణ రంగ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు

### ఎమ్మెల్సీ అనంతబాబు నివాసంలో సోదాలు

### అందుబాటులో లేని ఎమ్మెల్సీ

కాకినాడఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సంబంధించిన కాకినాడలోని అపార్ట్‌మెంట్‌లో పోలీసులు మంగళవారం ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. ముగ్గురు సీఐల బృందం అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ పరిణామం డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుతో సంబంధం ఉన్నదిగా తెలుస్తోంది. సాక్ష్యాల ఆధారంగా ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, పోలీసులు చేరుకునే సమయానికి అనంతబాబు అక్కడ లేకపోవడం గమనార్హం. పోలీసులు వస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకొని ఆయన పరార్ అయినట్లు తెలుస్తోంది. అనంతబాబు కోసం పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రభావితం చేయడానికి అనంతబాబు ప్రయత్నించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సాక్షుల నుంచి సేకరించిన సమాచారం, ఆధారాల ఆధారంగా పోలీసులు ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 2022 మే 19వ తేదీన వీధి సుబ్రహ్మణ్యం హత్య ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అదే రోజు అనంతబాబు పుట్టిన రోజు కావడం కూడా కేసుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. సుబ్రహ్మణ్యం హత్య జరిగిన రోజున రాత్రి అనంతబాబు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. సుబ్రహ్మణ్యం గత ఆరు సంవత్సరాలుగా అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేశారు. తన వివాహం కోసం అనంతబాబు వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ సీసీటీవీ ఫుటేజ్, కాల్ రికార్డులు వంటి కీలక ఆధారాలను సిట్ సేకరించింది.

# ఆర్టీసీ సమ్మె యథాతథం ప్రభుత్వంతో చర్చలు విఫలం

హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యం అయ్యింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు వెళుతున్నట్లు జెఎసి ప్రకటించింది. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశం కీలక మలుపు తిరిగింది. టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో సమ్మె బాట పట్టాలని జేఏసీ నాయకులు నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వంతో జరిగిన తాజా చర్చల్లో సమస్యలకు తక్షణ పరిష్కారం కనిపించలేదని తెలిపారు. ఐఏఎస్ అధికారుల కమిటీ నాలుగు వారాల సమయం కోరగా, దానికి తాము అంగీకరించలేదని వెల్లడించారు. ఇప్పటికే చాలాకాలంగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, మరింత ఆలస్యం సహించలేమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. జేఏసీ నాయకుల ప్రకటన ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మె ప్రారంభించనున్నారు. ఈ సమ్మె తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రవాణా సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మార్చి 13వ తేదీన సమ్మె నోటీస్ ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. సమ్మెకు ముందురోజే చర్చలకు పిలవడం సరైన విధానం కాదని జేఏసీ నాయకులు విమర్శించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అధికారుల కమిటీ సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినా, స్పష్టమైన హామీ ఇవ్వలేదని తెలిపారు. జేఏసీ నాయకులు కార్మికులకు కీలక పిలుపునిచ్చారు. ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, సమ్మెను ఐక్యంగా కొనసాగించాలని సూచించారు. అన్ని డిపోల్లో సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ సమ్మె కారణంగా బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. రోజువారీ ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. ప్రైవేట్ రవాణాపై ఆధారపడాల్సి రావచ్చు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య త్వరగా పరిష్కారించాలని ప్రయాణికులు ఆశిస్తున్నారు. కార్మికుల సమ్మె తెలంగాణలో కీలక పరిణామంగా మారింది. చర్చలు విఫలం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, జేఏసీ వైఖరి ఈ సమ్మె భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# రూల్ ఆఫ్ లాకు లోబడి సేవలు

### సివిల్ సర్వెంట్స్‌కు సిఎస్ సూచనలు

అమరావతిఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

సివిల్ సర్వెంట్స్ రూల్ ఆఫ్ లాకు లోబడి సేవలు అందించేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..సివిల్ సర్వెంట్‌లు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలని అన్నారు. నిరంతరం విజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలని సూచించారు. భారతదేశ పరిపాలన వ్యవస్థకు సివిల్ సర్వెంట్లు వెన్నెముక వంటివారని పేర్కొన్నారు.. వీరి అంకితభావాన్ని, నిరంతర కృషిని గౌరవిస్తూ ప్రతి ఏడాది ఏప్రిల్ 21న జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అధికారులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని సీఎస్ పేర్కొన్నారు.

# బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

### - 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్

### - బైక్ ర్యాలీలపై ఇసి నిషేధం విధింపు

కోల్‌కతా,ఏప్రిల్ 21 (ప్రజా వీక్షణం)

అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశ పోలింగ్ ప్రచారపర్వం ముగిసింది. ఏప్రిల్ 23న బెంగాల్‌లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

# తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

### - 23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

చెన్నై,ఏప్రిల్ 21(ప్రజా వీక్షణం)

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరఫున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

హైదరాబాద్,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల అస్వస్థత

### కలెక్టర్‌తో మాట్లాడి ఆరా తీసిన మంత్రి

అల్లూరి సీతారామరాజు,ఏప్రిల్21 (ప్రజా వీక్షణం)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పెదబయలు ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెంటనే స్పందించి కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలు అస్వస్థతకు గురవడం ఫుడ్‌పాయిజన్ వల్ల కాదని, ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్లే అలసట, అస్వస్థతకు గురయ్యారని వైద్యులు ప్రాథమికంగా గుర్తించారని మంత్రికి అధికారులు వివరించారు. ఈ ఘటనపై మంత్రి సంధ్యారాణి జిల్లా అధికారులతో, పెదబయలు మెడికల్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అలాగే పిల్లలకు ఓఆర్ఎస్‌లు తాగించడంతో పాటు అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నామని మంత్రికి అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రికి తరలించిన సుమారు పదిమంది విద్యార్థులు చికిత్స అనంతరం కోలుకుని హాస్టల్‌లో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. హాస్టల్లోనే మరో 48 గంటలు డాక్టర్ల పర్యవేక్షణలో విద్యార్థులు ఉండాలని అధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

SPORTS/ BUSINESS

22 బుధవారం, ఏప్రిల్ 2026

www.prajaveekshanam.in




# చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ




ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న యువ బ్యాటర్ ఆయుష్ మాత్రె గాయం కారణంగా ఐపీఎల్ 2026 మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా ధృవీకరించడంతో సీఎస్కే అభిమానులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. టోర్నీ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో ఇది జట్టుకు పెద్ద లోటుగా మారింది. ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ మాత్రె బ్యాటింగ్ చేస్తుండగా కండరాల గాయానికి (హ్యామ్‌స్ట్రింగ్) గురయ్యాడు. క్రీజులో పరుగు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఆయుష్, నొప్పితో విలవిలలాడుతూ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షలు నిర్వహించిన వైద్యులు, గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేల్చారు. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. "ఆయుష్ మాత్రె ఎడమ కాలు కండరాల గాయం కారణంగా ఈ సీజన్ నుంచి తప్పుకుంటున్నాడు. అతను కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ క్లిష్ట సమయంలో అతనికి అండగా ఉంటాం, ఆయుష్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం" అని జట్టు యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్, సంజూ శామ్సన్ ఓపెనర్లుగా వస్తుండగా, మూడో స్థానంలో ఆయుష్ మాత్రె నమ్మదగ్గ ఆటగాడిగా ఎదిగాడు. కీలక సమయాల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో అతను పోషించిన పాత్ర అమోఘం. ఇప్పుడు అతను అందుబాటులో లేకపోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన ఆటగాడి కోసం కెప్టెన్, కోచింగ్ బృందం అన్వేషిస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లపై ఇప్పుడు అదనపు భారం పడనుంది. ఆయుష్ స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకునే అవకాశంపై సీఎస్కే ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రీహాబిలిటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు మూడు నెలలు పట్టే అవకాశం ఉండటంతో, అతను వచ్చే దేశవాళీ సీజన్ నాటికి సిద్ధమవుతాడని భావిస్తున్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న చెన్నై జట్టుకు, ఈ మార్పులు ఏ మేరకు కలిసి వస్తాయో వేచి చూడాలి.

# చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

## బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా



టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది. యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

# ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు

వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిపించిన యువ పేసర్ ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు వేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రెండు మార్పులతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ప్రఫుల్ హింగే, లివింగ్ స్టోన్‌లను తుది జట్టు నుంచి తప్పించి ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్ లిస్ట్‌లో చేర్చింది. పిచ్ స్పిన్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. ఎక్కువ స్పిన్ ఆప్షన్స్ కోసం ప్రఫుల్ హింగేను పక్కనపెట్టామని చెప్పాడు. దిల్షాన్ మదుషంక తుది జట్టులోకి వచ్చాడని ఇషాన్ కిషన్ తెలిపాడు. అయితే ప్రఫుల్ హింగే, మదుషంకలో ఒకరే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడుతారని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్.. గత మ్యాచ్‌లతో పోల్చితే ఇది భిన్నమైన వికెట్ అని తెలిపాడు. 'ఈ పిచ్‌పై ఇప్పుడే ఒక నిర్ణయానికి రాలేం. ఎందుకంటే గత కొన్ని మ్యాచ్‌ల్లో మేం ఆడిన వికెట్ లాగా ఇది లేదు. పిచ్ కండిషన్స్ బట్టి ఆడాల్సి ఉంది. ఈ రోజు మా తుది జట్టులో కొన్ని మార్పులు ఉన్నాయి, మధుషంక బరిలోకి దిగుతుండగా.. ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఈ విషయంపై నాకు క్లారిటీ లేదు. హర్ష్‌దూబే తిరిగి జట్టులోకి వచ్చాడు. ఎందుకంటే ఇది కొంచెం స్లో ట్రాక్. వికెట్లు తీయడానికి మాకు స్పిన్ ఆప్షన్ ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం. మా కుర్రాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఫలితాలను చూసి ఈ మాట చెప్పడం లేదు. మా ప్రణాళికలను వారు అమలు చేస్తున్న విధానం, వారి మనస్థత్వం చూసి ఈ మాట అంటున్నా. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ విషయంలో తమకు అదృష్టం కలిసి వస్తుందన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడుతానని అనుకోలేదని, ఈ రోజు విజయం దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నానని వెల్లడించాడు. తమ తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన అక్షర్ పటేల్.. ఆకీబ్ స్థానంలో నితీష్ రాణా బరిలోకి దిగుతున్నాడని తెలిపాడు.

# బెంగాల్ ఎన్నికల వేళ చిక్కుల్లో యూసఫ్ పఠాన్



మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు మరియు మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు. దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (గతంలో ఐపీసీ) లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితులను కోర్టులో హాజరుపరిచినప్పుడు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు మరియు సీసీటీవీ ఫుటేజ్ తమ వద్ద బలంగా ఉన్నాయని పోలీసులు కోర్టుకు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో,ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసుఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, ఒత్తిడి వల్ల చిన్న చిన్న కారణాలకే ప్రజలు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది.



# మధ్య ఓవర్లలో పట్టు కోల్పోయాం: శుభ్‌మన్ గిల్


ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 99 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. ముంబై బౌలర్ల ధాటికి కేవలం 100 పరుగులకే చాపచుట్టేసింది. అయితే జట్టు మొత్తం బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ.. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం ఈ ఓటమికి బౌలర్లనే బాధ్యులను చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రజెంటేషన్ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ బౌలర్లు మధ్య ఓవర్లలో ధారాళంగా పరుగులు ఇచ్చేశారని అసహనం వ్యక్తం చేశాడు. పిచ్ స్లోగా ఉన్నందున ఇక్కడ 160 నుంచి 170 పరుగులు సరైన స్కోరు అని.. కానీ ముంబైని తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో తమ బౌలర్లు విఫలమయ్యారని గిల్ పేర్కొన్నాడు. సరైన లెంగ్త్‌లో బంతులు వేయకపోవడం వల్లే ముంబై భారీ స్కోరు సాధించిందని ఆయన అభిప్రాయపడ్డాడు. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్, తిలక్ వర్మ (101లి) వీరోచిత సెంచరీతో 199 పరుగులు చేసింది. నిజానికి గుజరాత్ బౌలర్ కగిసో రబాడ పవర్‌ప్లేలోనే 3 వికెట్లు తీసి ముంబైని దెబ్బతీసినా.. మిడిల్ ఓవర్లలో ఇతర బౌలర్లు తిలక్ వర్మను అడ్డుకోలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ముంబై బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో గుజరాత్ చేతుల్లోంచి మ్యాచ్ జారిపోయింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి ఎగబాకింది. ఆడిన 6 మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో 4 పాయింట్లు సాధించి నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకుంది. మరోవైపు ఈ భారీ ఓటమి వల్ల గుజరాత్ టైటాన్స్ ఆరో స్థానానికి పడిపోయింది. మూడు విజయాలు ఉన్నప్పటికీ.. రన్ రేట్ భారీగా దెబ్బతినడం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఓటమి ఓ చిన్న అడ్డంకి మాత్రమేనని, రాబోయే మ్యాచుల్లో బలంగా పుంజుకుంటామని శుభ్‌మన్ గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల





కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ డయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ డయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.

## జైలర్-2 షూటింగ్ పార్ట పూర్తి కేక్ కట్‌చేసి సెటబ్రేషన్ చేసుకున్న యూనిట్




సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మిర్నా మినన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

## శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ




మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com